బదులుగా శివుడు మందహాసం చేసి చెప్పాడు.

"దేవీ! లోకంలో ఏదీ కంటికి కనబడ్డట్లుగా వుండదు. ఆ ధనవంతుడి పూర్వీకులు ఆ గోడలో బంగారు నిధిని దాచారు. వాళ్ళు దానికి మరమ్మత్తు చేయిస్తే ఆ నిధి బయటపడి వారికి దక్కుతుందని వీళ్ళ కంటబడే వీలు లేకుండా ఆ కంతని మూసేసాను."

"అది బావుంది. కాని ఈ బీదవాళ్ళకి ఎందుకు తగిన సహాయం చేయలేదు మీరు?" ప్రశ్నించింది పార్వతి.

"ఎందుకు చేయలేదు? నిన్న రాత్రి ఆ బీదవాడ్ని తీసుకెళ్ళడానికి మృత్యుదేవత వచ్చింది. అతనే వీరి కుటుంబానికి ఆధారం కనుక అతని బదులుగా ఆవుని తీసుకెళ్ళమని దానికి చెప్పాను."

"అర్థమైంది స్వామి. జరిగేది ఏదైనా చెడుగా కనబడ్డా, అది దైవ సంకల్పంతో మంచికే దారితీస్తుంది. కాబట్టి దేన్నీ జరిగింది జరిగినట్లుగా స్వీకరించకూడదు." ఒప్పుకుంది పార్వతి.

## 46. పాప ఫలం

ధర్మశాస్త్రం క్షుణ్ణంగా చదువుకున్న రామనాథానికి పాపపుణ్యాల ఫలితంగానే మనిషికి కష్టసుఖాలు లభిస్తాయన్న నమ్మకం బలంగా వుంది. అందుకని చెడు పనులు చేయద్దని, సాధ్యమైనంతవరకు మంచి పనులే చేయమని అందరికీ బోధిస్తూంటాడు.

అతని కొడుక్కి చదువు పూర్తయ్యాక కలెక్టరాఫీసులో గుమాస్తా ఉద్యోగం వచ్చింది. మొదటిరోజు ఉద్యోగానికి వెళ్ళబోతూ అతను తండ్రి పాదాలకి నమస్కరించాడు. కొడుకుని ఆశీర్వదించి చెప్పాడు రామనాథం.

"మన వెంట వచ్చేవి మనం చేసే మంచి, చెడ్డ పనుల ఫలితాలు మాత్రమే సుమా! అంతే కాని మనం ఆర్జించే డబ్బు కాదు. నువు ఎవరినీ

లంచాల కోసం పీడించకుండా నీ ఉద్యోగాన్ని సక్రమంగా నిర్వర్తించు. ఈ మాట మర్చిపోతే అధోగతి పాలవుతావు జాగ్రత్త.”

“అలాగే నాన్నా. నిజాయితీగానే ఉంటాను.”బదులిచ్చాడతను.

అయితే సాటి ఉద్యోగులు ఆఫీసుకి పనిమీద వచ్చే సందర్శకుల నించి లంచాలు బలవంతంగా వసూలుచేసి కాని వారి పని చేయకపోవడంతో, త్వరలోనే కొడుకు కూడా లంచాలు తీసుకోవడం మొదలుపెట్టాడు. అతనూ రెండు చేతులా సంపాదించసాగాడు.

ఈ సంగతి తండ్రికి తెలిసి చాలా బాధ పడ్డాడు. ఆయన ఓ రోజు కొడుకుని పిలిచి చెప్పాడు.

“నాయనా! మనవూరి పూజారికి పక్షవాతం వచ్చి చెయ్యి, కాలు పడిపోయాయని తెలిసింది. అతనికి ఓ మహాత్ముడు ఆ రోగం ఇతరులకి బదిలీ చేసే చక్కటి మంత్రం ఒకటి ఉపదేశించాడుట. గ్రహణంరోజు నది ఒడ్డున నిలబడి ఆ మంత్ర సహాయంతో అతని రోగాన్ని ఎవరికైనా బదిలీ చేయచ్చుట. తన పక్షవాత రోగాన్ని దానంగా పుచ్చుకునే వారికోసం అతను చూస్తున్నాడు. తన రోగంతోపాటు పదిలక్షల రూపాయిలని కూడా ఆయన కృతజ్ఞతగా ఇస్తాడట. నువ్వు సమయం వృథా చేయక వెళ్ళి ఆ రోగం తీసుకుని ఆ డబ్బు సంపాదించు.”

“అమ్మో! పక్షవాత రోగమే? ఆ రోగంతో మంచం మీద పడుక్కుని సేవలు చేయించుకోవడం నా వల్ల కాదు.” చెప్పాడు కొడుకు.

“నువ్వు మంచంమీద ఉన్నా సేవ చేయడానికి నీ భార్య ఎటూ ఉంది. నీ భార్యా, పిల్లలు జీవితాంతం హాయిగా బతికేంత డబ్బది.”

“వద్దు నాన్నగారు.”

“నువ్వెత్త అవివేకిలా ఉన్నావే?”

“నేను అవివేకిని కాదు కనకే వద్దంటున్నాను.”

"కాని ఇలాంటి అవివేక పనులు చేయడంలో నీకు మంచి అనుభవం ఉందని చెప్పాను."

"నాకిలాంటి పనుల్లో అనుభవం ఉందా? ఈ రోజు మీరు చిత్రంగా మాట్లాడుతున్నారే."

చిన్నగా నవ్వి చెప్పాడు తండ్రి.

"'పూర్వ జన్మ కృతం పాపం వ్యాధి రూపేణ పీడితం' అని పెద్దలు ఆయుర్వేదంలో చెప్పారు. అంటే, మనం చేసే పాపాలన్నీ మనల్ని రోగాల రూపంలో బాధిస్తాయి అని అర్థం. నువ్వు ఎటూ నీ ఉద్యోగ నిర్వహణలో లంచాలు తీసుకుంటున్నావు. లంచం ఇచ్చినవారి ఉసురు తగిలి ఎలాగూ ఆ పాపాలకి నీకు పక్షవాతమో, ఇంకేదైనా భయంకర రోగమో వచ్చి చావడం ఖాయం. కాకపోతే నువు నీ ఉద్యోగంలో ఉండగా రోజుకి కొంచెం కొంచెంగా ఆ రోగాలని పోగు చేసుకుంటున్నావు. ఈ రోగదానం ఒక్కసారిగా పుచ్చుకోవడంవల్ల నీకా సంగతి స్పష్టంగా తెలుస్తోందంతే."

తను రోజుకి కొంత చొప్పున లంచాల రూపంలో ఆర్జించే పాపాన్ని గురించి, దాన్ని తనే ఎప్పటికైనా అనుభవించక తప్పదని తండ్రి తనకిలా అన్యాపదేశంగా ఉపదేశిస్తున్నాడని కొడుక్కి అర్థమైంది. తండ్రి హెచ్చరికలోని హితవుని గ్రహించిన ఆ కొడుక్కి జ్ఞానోదయమైంది. తన భార్య, పిల్లలు తను సంపాదించేది అనుభవిస్తే, తన పాప ఫలాన్ని మాత్రం తనే అనుభవించాలన్న సత్యం బోధపడటంతో అంతదాకా వక్రమార్గంలో సంపాదించినదంతా అతను బీదసాదలకి దానం చేసేసి, నిజాయితీగా బ్రతకసాగాడు.

## 47. పార్క్‌లో ఓ సాయంత్రం

ఓ చిన్నపిల్లవాడికి భగవంతుడు ఎలా ఉంటాడో చూడాలన్న కోరిక కలిగింది. దేవుడు తమ ఊరికి చాలా దూరంలో ఉంటాడని విని వుండటంతో,